క్లుప్తంగా

అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి 108 రకాల పిండివంటలతో సమర్పించిన సారె

ఉండి: వెలివర్రులో వేంచేసియున్న వీరపేరంటాలమ్మకు ఈలంపూడికి చెందిన ముదుండి శ్రీనివాసరాజు దంపతులు 108 రకాల పిండి వంటలతో ఆదివారం సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పుష్పాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సారె సమర్పించి అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



విద్యార్థినికి మెమెంటో ఇస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

తణుకు అర్బన్: విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు యూత్ యాక్టివిటీస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆనందం మస్తాన్‌రావు (బాబి) అన్నారు. తణుకు రోటరీ క్లబ్‌లో యూత్ యాక్టివిటీస్‌లో భాగంగా ఆదివారం అమర్ ఆర్ట్స్ అకాడమీ సౌజన్యంతో పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై రెండు నుంచి పదో తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీలకు పలు పాఠశాలల నుంచి హాజరైన 200 మంది విద్యార్థుల్లో విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కఠారి సిద్ధార్థ, అకాడమీ అధ్యక్షుడు అమర్, సభ్యులు గమిని రాంబాబు, పోతుల శ్రీనివాస్, అక్కిన కాశీ, వంగూరి హనుమంతరావు, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, బోడపాటి ప్రసాద్, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో జనతా ట్రస్ట్ నిర్వహణలో అధ్యక్షులు వీవీఎస్ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో జి.హరిబాబు ఆర్థిక సహకారంతో ఆదివారం స్థానిక కడకట్ల జనతా ట్రస్ట్ కార్యాలయంలో ఉచిత సుగర్ వ్యాధి రక్త పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 94 మంది రోగులకు పరీక్షలు చేశారు. సుగర్ వ్యాధి గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సన్నిధి సూర్యనారాయణ మూర్తి, చిన్నం జగదీష్, భీమవరపు మహాలక్ష్మి, బాపయ్య శర్మ, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, వి.రామ్మోహన్, సీహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఎన్నిక



పట్టణ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్ఎఫ్ఐ పట్టణ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు ఎస్.లక్ష్మణరావు వివరాలను వెల్లడించారు. పట్టణ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పి.నాగేంద్ర, టి.రవిబాబు, పట్టణ ఉపాధ్యక్షులు మణికంఠ, గణేష్, కార్యదర్శులు కేశవ, పవన్, గణేష్, సభ్యులుగా సత్యదిలీప్, గౌతం, భాను ప్రకాశ్, ధనుష్, సుభాకర్‌తో సహా 13 మంది సభ్యులతో నూతన కమిటీ ఎంపిక చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటాలు చేస్తామన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన, ఇతర బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

నేటి నుంచి జాతీయ సమైక్యత శిబిరం

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాలలో సోమవారం నుంచి జాతీయ సమైక్యత శిబిరం నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.సెంట్రల్ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పాత రోడ్డుకు మోక్షమెప్పుడో?

- ఇరుకు రోడ్డుతో నిత్యం ట్రాఫిక్
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఆకివీడు: జాతీయ రహదారి 165 స్థానిక ఉప్పుటేరు నుంచి అజ్జమూరు వరకూ రహదారి అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నచందంగా ఉంది. ఈ రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా ఒక్క గిన్నె తారు వేసిన దాఖలాలు లేవని స్థానికులు వాపోతున్నారు. ఏళ్ల తరబడి ఉన్న రహదారికి తూట్లు పడుతుంటే, ఆ శాఖ అధికారులు మాత్రం మాట్లు వేసి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎస్ టర్నింగ్ వద్ద 20 ఏళ్ల క్రితం జాతయ రహదారిపై సీసీ రోడ్డు నిర్మించారు. ఆ రోడ్డు ముక్కముక్కలై వాహనచోదకులకు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కల్గిస్తుంది. వాహనాలు నడుపుతుంటే పడిపోతామేమోనన్న భయాందోళనలో ప్రయాణికులు ఉన్నారు. సీసీ రోడ్డు పూర్తిగా పాడైపోయింది.

స్థలం ఉన్నా కొనుగోలే మిన్నా !

జాతీయ రహదారి స్థానిక ఉప్పుటేరు వంతెన వద్ద నుంచి తెల్ల వంతెన వరకూ నాలుగు లైన్ల రహదారికి అనువైన స్థలం ఉన్నప్పటికీ ప్రధాన సెంటర్‌ను దృష్టిలో పెట్టుకుని బైపాస్ రోడ్డు ఏర్పాటుకు కోట్లు వెచ్చిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉప్పుటేరు వద్ద నుంచి అయిభీమవరం రోడ్డు వరకూ, మాదివాడ సెంటర్ నుంచి తెల్ల వంతెన వరకూ నాలుగు లైన్లకు సరిపడే జాతీయ రహదారి భూమి ఉంది. దీనిని స్థానికులు ఆక్రమించుకున్నారు. ఇటీవల ఆక్రమణలు తొలగించినప్పటికీ, రహదారి విస్తరణ పనులు చేపట్టలేదు. దీంతో పొలం, చెరువు భూములకు ఎదురుగా ఉన్న ఎన్‌హెచ్ భూమిని ఆక్రమించి రేకులు, దడులు కట్టి బందోబస్తు చేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్‌హెచ్ 165 అభివృద్ధి, బైపాస్ రోడ్డు నిర్మాణానికి పన్నెండేళ్ల క్రితం కేంద్ర మంత్రి భూమి పూజ చేసినప్పటికీ నేటికీ ఓ కొలిక్కి రాలేదు. భూమి కొనుగోలు ప్రక్రియ నేటికీ పరిశీలనలోనే ఉంది. భూమి యజమానులకు ఇంకా సొమ్ము చెల్లించలేదు.



రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఎస్ టర్నింగ్ వద్ద నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్

విస్తరణ పనులు చేపట్టాలి

స్థానిక ఉప్పుటేరు నుంచి తెల్ల వంతెన వరకూ రహదారి విస్తరణ పనులు చేపట్టాలని పలువురు ఎన్‌హెచ్ అధికారులను కోరుతున్నారు. పట్టణ ప్రాంతంలో పక్కా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని, నాలుగు లైన్ల విస్తరణ పనులు ప్రారంభించాలని ఈ ప్రాంతానికి చెందిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మకు పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

5న దేశ వ్యాప్త నిరసన

భీమవరం: కార్మిక వర్గానికి నష్టం చేసే లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ దేశవ్యాప్త నిరసన చేపట్టిందని పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జేఎన్‌వీ గోపాలన్, కె.రాజా రామ్మోహన్‌రాయ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ బ్రిటిష్ కాలం నుంచి కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి లేబర్ కోడ్లుగా మార్చిందన్నారు. దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు లేబర్ కోడ్లపై ఆందోళన చేస్తున్నాయన్నారు. కార్మిక హక్కులు కాలరాసే విధంగా యజమానులకు కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన విధంగా లేబర్ కోడ్లు రూపొందించబడ్డాయన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ విధానాల మీద దేశ వ్యాప్తంగా రైతాంగం ఆందోళన చేస్తుందని అదే విధంగా కార్మిక వర్గం కూడా లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఆందోళన చేయటానికి సిద్ధపడుతుందన్నారు. అందులో భాగంగానే ఫిబ్రవరి 5న నిరసన కార్యక్రమం చేపట్టామని జిల్లాలో అన్ని మండలాల్లోనూ నిరసన సభలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

తాత్కాలికంగా గుర్రపు డెక్క తొలగింపు

ఆకివీడు: పంట కాల్వలో తూడు, గుర్రపుడెక్క తొలగింపుకు ఏటా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంటే సంబంధిత కాంట్రాక్టర్లు వాటిని కాల్వలోనే నెట్టివేసి చేతులు దులుపుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. స్థానిక వెంకయ్య వయ్యేరు పంట కాల్వలో గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు ఆదివారం చేపట్టారు. కాలువ ఎగువ భాగంలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను గట్లపైకి లాగివేయకుండా నీటిలోనే నెట్టివేయడం ద్వారా దిగువ ప్రాంతాల రైతులకు ఇబ్బంది కరంగా తయారైంది. వంతెనలు, లాకుల వద్ద గుర్రపుడెక్క తిష్ట వేసి నీటి ప్రవాహానికి ఆటంకం కల్గిస్తుందని పలువురు రైతులు వాపోతున్నారు. తూడు, గుర్రపుడెక్క కాలువ నుంచి బయటకు తీసేందుకు కాంట్రాక్ట్ పొందినప్పటికీ నీటి పారుదలలోనే నెట్టివేయడం వలన కాంట్రాక్టర్‌కు సొమ్ము ఆదా అవుతుందని పలువురు పేర్కొంటున్నారు. ఎగువ నుంచి వచ్చే గుర్రపుడెక్క మీడియం, మైనర్ పంట కాల్వల్లోకి ప్రవేశించి, మళ్లీ విపరీతంగా పెరిగిపోతుందంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



స్థానిక వెంకయ్యవయ్యేరు పంట కాల్వలోని గుర్రపుడెక్కను నెట్టివేస్తున్న దృశ్యం

మోడల్ కోడ్‌ను విధిగా పాటించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మోడల్ కోడ్‌ను రాజకీయ పార్టీలు విధిగా పాటించాలని జిల్లా రెవెన్యూ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు కోరారు. భీమవరం కలెక్టరేట్ డీఆర్‌ఓ చాంబర్‌లో డీఆర్ఓ, ఏఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్, మోడల్ కోడ్ గురించి వివరించారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. ఈ నెల 3న ఎన్నికల నోటిఫికేషన్ కూడా జారీ అవుతుందన్నారు. ఫిబ్రవరి 3 నుంచి 10వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. 13న నామినేషన్ల ఉపసంహరణ, 27న ఎన్నికల పోలింగ్ ఉంటుందన్నారు. పోలింగ్ బ్యాలెట్ పేపర్ ద్వారా మాత్రమే నిర్వహిస్తారన్నారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని వివరించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. ఏలూరు జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారి కాగా, ఏఆర్వోలుగా ఆయా జిల్లాల డీఆర్వోలు వ్యవహరిస్తారన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 69,884 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లుగా ఉన్నారన్నారు. 93 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు ఏలూరు కలెక్టరేట్‌లో ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. సమావేశంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు వంశీరెడ్డి, ఎం.ఆంజనేయులు, ఎం.రంగరాజు, ఎం.శ్యాంబాబు, జయశివ, ఇన్‌చార్జి ఎలక్షన్ సూపరింటెండెంట్ మద్రాపు సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

చిత్తడి నేలలతో నీటి శుద్ధి

భీమవరం: స్పేస్ సంస్థ ఆధ్వర్యంలో భీమవరంలో చిత్తడి నేలల దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రొఫెసర్ పీఆర్‌కే రాజ మాట్లాడుతూ మన డెల్టా ప్రాంతానికి చిత్తడి నేలలు ఒక వరమని అనేక సంవత్సరాలుగా ఇక్కడ ఉన్న చిత్తడి నేలలు నీటిని శుద్ధి చేసి, భూగర్భ జలాలను పెంచడంతో పాటు వ్యవసాయానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. కె.కమలాకర్ శర్మ మాట్లాడుతూ చిత్తడి నేలలు కార్బన్ ప్రాసెసింగ్‌లో ముఖ్యమైన భూమిక పోషిస్తాయని తెలిపారు. కె.గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ భూగర్భ నీటి నిల్వలు పెంచడంలో చిత్తడి నేలలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. తమ్మినేడి నాగేశ్వరరావు మాట్లాడుతూ చిత్తడి నేలలను పరిరక్షించవలసిన బాధ్యత రైతుల మీద కూడా ఉందన్నారు. పాతపాటి మురళి రామరాజు మాట్లాడుతూ చిత్తడి నేలలు ప్రాముఖ్యతను ఉపయోగాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు.



చిత్తడి నేలల దినోత్సవంలో మాట్లాడుతున్న వక్తలు

విద్యార్థికి చదువే మూలాధారం

భీమవరం: ప్రతి విద్యార్థికి చదువే మూలాధారమని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని జనసేన పట్టణ కార్యదర్శి సుంకర రవి అన్నారు. భీమవరం రెడ్డి కాలనీలోని శ్రీసిద్ధి గణపతి ఆలయంలో పంచమిని పురస్కరించుకొని 210 మంది చిన్నారులచే సరస్వతి పూజ చేయించి, పెన్నులు, పుస్తకాలను పంపిణీ చేశారు. రవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ ఎంతో ప్రతిభ దాగి ఉంటుందని, అనుకున్న లక్ష్యాలను సాధించేలా పట్టుదల క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం అర్చకులు చిన్నారులచే సరస్వతి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో రామాయణం రమేష్ బాబు, కొనల చిన్నారి, పంతం ప్రసాద్, గాలి నరసింహారావు, బుర్ర మాణిక్యాల రావు, జక్కా సుబ్బారావు, సాదనాల నాని, మురళీ భాస్కర్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బల్లల పూజ



బల్లల పూజలో పాల్గొన్న రజకులు

భీమవరం (ప్రకాశంచౌక్): పేరంటాల చెరువు గట్టు వద్ద శ్రీఆదిలక్ష్మి రజక సంఘం ఆధ్వర్యంలో గత 120 సంవత్సరాలుగా సాంప్రదాయ బద్ధంగా బల్లల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మా పూర్వీకులు 120 సంవత్సరాల క్రితం రజక సంఘ పెద్దలు ఈ బల్లల పండుగ ప్రారంభించారని, ఆ పండుగ సంక్రాంతి, భోగి పండుగ నుంచి బల్లల పూజ రోజు వరకూ రజక వృత్తిదారులు సెలవు పాటించి, బల్లలకు పూజలు చేసి, గంగమ్మ తల్లికి ధూపదీప నైవేద్యాలు, హారతులు ఇచ్చి, పసుపు కుంకుమ చలివిడి పానకాలు సమర్పిస్తారన్నారు. సంక్రాంతి తర్వాత వచ్చే ఆదివారం గాని గురువారం గాని ఈ పండుగ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆదిలక్ష్మి రజక సంఘం నాయకులు దొమ్మేటి నరసింహమూర్తి, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, నేదునూరి గంగాధర తిలక్, దొమ్మేటి సుబ్బయ్య, అమనాపు వెంకటేశ్వరరావు, (ఆదిత్య బాబి), కొల్లేటి అయ్యప్ప, సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్, రజక యూత్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రహదారి పైనే వాహనాల నిలిపివేత

వీరవాసరం: రహదారి పైనే వాహనాలు నిలిపివేయడంతో ప్రయాణికులు, వాహన చోదకులు పలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రమైన వీరవాసరంలో రైల్వే గేటు సమీపంలో గతంలో ప్రైవేట్ గోడౌన్ నిర్మించారు. స్థానిక బియ్యం నిల్వలను గోడౌన్‌లో ఉంచే విధంగా గత సీజన్‌లో గోడౌన్ ప్రారంభమైంది. ఇదంతా బాగానే ఉంది. వీరవాసరం–బ్రాహ్మణ చెరువు రహదారిలో వీరవాసరం రైల్వే గేట్ సమీపంలో ఈ ప్రైవేట్ గోడౌన్ ఉంది. రైల్వే గేటు పక్కనే వీరవాసరం పెదపేటకు ఆనుకుని రహదారి నిర్మాణం చేపట్టి గోడౌన్‌కు రాకపోకలను సాగిస్తున్నారు. దాళ్వా సీజన్ కావడంతో రైస్‌మిల్లు నుంచి లారీలపై, భారీ వాహనాలతో బియ్యాన్ని గోడౌన్‌కు తరలించడానికి పెద్ద ఎత్తున నిత్యం వాహనాలు వస్తున్నాయి. గోడౌన్ నుంచి వీరవాసరం–బ్రాహ్మణ చెరువు ప్రధాన రహదారిపై పెద్ద సంఖ్యలో భారీ వాహనాలు, లారీలు నిలుపుతుండడంతో ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వీరవాసరం రైల్వే గేటు వేసిన సందర్భంలో ట్రాఫిక్ స్తంభించి ప్రయాణికులు అష్ట కష్టాలు పడుతున్నారు. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని నానా అవస్థలు పడుతున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై వాహనాలు నిలుపుతుండడంతో అడుగడుగునా ట్రాఫిక్ జామ్ అవుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రహదారిపై నిలిపిన వాహనాలు

బెల్టు షాపులపై దాడి

తాడేపల్లిగూడెం: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆదివారం పోలీసులు చేసిన దాడుల్లో ఒకరిని అరెస్టు చేశారు. గణపవరంలో బెల్టు దుకాణం నిర్వహిస్తూ, మద్యం విక్రయిస్తున్న ఒకరి వద్ద నుంచి 18 డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి, ఎస్సైలు మురళీమోహన్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

జంతు హింసను నివారించాలి

తణుకు అర్బన్ : జంతు హింసను నివారించి పశువులపై ప్రేమతో వాటి కనీస అవసరాలు తీర్చాలని రాష్ట్ర పశు ఆరోగ్య సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వాకాణి ప్రసాద్ అన్నారు. తణుకులోని పశు వైద్యశాల ఆవరణలో ఆదివారం పశు పెంపకందారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత జంతు సంక్షేమ బోర్డు ఆదేశానుసారం వసంత పంచమి రోజును జీవ జంతు కల్యాణ దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. మూగజీవుల పట్ల ప్రతి ఒక్కరూ దయతో వ్యవహరించాలని, జంతు సంరక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. మూగజీవులను సంరక్షించి వాటి పోషణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శ్రీనివాస్, పశు పెంపకదారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వాకాణి ప్రసాద్

చాంబర్స్ కళాశాలలో మెరిట్ టెస్ట్

పాలకొల్లు అర్బన్: పోటీ పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ అన్నారు. పాలకొల్లు చాంబర్స్ డిగ్రీ కళాశాల ఆవరణలో పదో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ పశ్నాపత్రాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్సీ అంగర చేతుల మీదులుగా విడుదల చేశారు. ఈ పరీక్షకు పాలకొల్లు పట్టణ, పరిసర గ్రామాలకు చెందిన 2436 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరందరికీ పరీక్ష అట్టలు, పెన్నులు కళాశాల యాజమాన్యం అందజేసింది. కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేవీ సీతారామరాజు, కోశాధికారి రేపాక ప్రవీణ్‌భాను, తటవర్తి కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డా.డి వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తోట వాల్గా పాల్గొన్నారు.

గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ఫౌండర్ చెన్నాత్రికళ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఆదివారం దాతల సహకారంతో ఇద్దరు విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. ఇంటర్మీడియట్ చదువుతున్న ఉదయ్ శ్రీనివాస్, అదే విధంగా 5వ తరగతికి చెందిన విద్యార్థి హర్షకు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టీ జనార్దనరావు, ఉమా, మాజీ కౌన్సిలర్ కర్రి ప్రభాకర్ బాలాజీ, టీచర్లు ఆనందరావు, ప్రకాష్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో చేనేత రంగానికి రిక్తహస్తం

నరసాపురం: దేశంలో చేనేత రంగం సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించి రిక్తహస్తం చూపించిందని ఏపీ చేనేత కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు బూడిద జోగేశ్వరరావు విమర్శించారు. చేనేతకు అదనపు నిధులు కేటాయించాలని కోరుతూ ఆదివారం 18వ వార్డులో ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగేశ్వరరావు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే చేనేత సంక్షేమానికి రూ.5 వేల కోట్లు కేటాయిస్తామని బీజేపీ గతంలో హామీ ఇచ్చిందని చెప్పారు. ఇప్పుడు అరకొర కేటాయింపులు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో చేనేత రంగం సంక్షోభంలో కొట్టిమిట్టాడుతుందని, ఈ రంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్

భీమవరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా ఉందని సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. భీమవరంలో ఆదివారం జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.ఆంజనేయులు ప్రసంగించారు. కార్పొరేట్లకు అనుకూలంగా ఈ బడ్జెట్ ఉందని రైతులు, కార్మికులతో పాటు పలు రంగాలకు కేటాయింపులు గతం కంటే తగ్గించారన్నారు. ఎన్నికలు, ఓట్లను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌ను కేటాయించడం కేంద్ర పాలకులకు అలవాటుగా మారిందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోలవరం నిర్వాసితులు వంటి సమస్యలకు రిక్త హస్తమే చూపించారన్నారు. కష్ట జీవులకు, రైతులకు ఈ బడ్జెట్‌లో న్యాయం జరగలేదన్నారు. కార్యక్రమంలో త్రిమూర్తులు, దేగల నాగేశ్వరరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



భీమవరం: కేంద్ర బడ్జెట్‌పై నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం శ్రేణులు

కేంద్ర బడ్జెట్‌ను ప్రజలు వ్యతిరేకించాలి

భీమవరం అర్బన్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను ప్రజలందరూ వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని తోకతిప్పలో కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రైతులు, కార్మికులు, ప్రజలకు పెద్దపీట వేస్తామని చెప్పి ఉసూరుమనిపించారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్, ఎరువులు, ఆహార పదార్థాలకు సంబంధించిన వాటిపై సబ్సిడీకి నిధులు కేటాయించకపోవడం సామాన్యుడిపై భారం పడుతుందన్నారు. విద్య, వైద్యం, సామాజిక రంగాలు, ఉపాధి కార్మికులకు బడ్జెట్‌లో కోతలు విధించిందని ఈ బడ్జెట్ కోతల బడ్జెట్ అన్నారు. కార్యక్రమంలో బొడ్డు లక్ష్మీపతి, తిరుమాని నాగేశ్వరరావు, తిరుమాని హనుమంతు, బస్వాని వెంకటేశ్వర్లు, మోకా సోమరాజు, తిరుమాని నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.



భీమవరం అర్బన్: తోకతిప్పలో నిరసన తెలుపుతున్న నాయకులు